



# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 279 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- | ఆదివారం 11 మే 2025

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# మే 12న హాట్‌లైన్‌లో భారత్-పాక్ చర్చలు

**భారత్-పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే.**

**ఢిల్లీ, మే 11, (రిపబ్లిక్ న్యూస్):** భారత్-పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కాల్పుల విరమణ, తదనంతర పరిస్థితిపై ఇరు దేశాల మధ్య సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు కీలక చర్చలు జరగనున్నాయి. హాట్‌లైన్‌లో జరగనున్న ఈ చర్చల్లో రెండు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్‌లు పాల్గొననున్నారు.



కాల్పుల విరమణ కొనసాగింపు, ఉద్రిక్త వాతావరణం తగ్గించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు భారత్ డీజీఎంవోతో పాకిస్థాన్ డీజీఎంవో హాట్ లైన్లో మాట్లాడారు. కాల్పుల విరమణ అంశాన్ని ప్రతిపాదించి.. వెంటనే అమలు చేద్దామని కోరారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చిందని భారత్ తరపున విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ ప్రకటించారు. మరోవైపు కాల్పుల విరమణ ప్రకటించిన కొన్నిగంటల్లోనే పాక్ సైన్యం ఉల్లంఘించింది.

# కాల్పుల విరమణను 'ట్రంప్' ఎందుకు ప్రకటించారు?:కాంగ్రెస్

**కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీలు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు.**

**ఢిల్లీ, మే 11, (రిపబ్లిక్ న్యూస్):** భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన కాల్పుల ఒప్పందంపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఎంపీ రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పీవోకేను పాకిస్థాన్ ఖాళీ చేయాలని కోరుతూ.. 1994లో లోక్సభ, రాజ్యసభలో ఏకగ్రీవంగా ఆమోదించబడిన తీర్మానం గురించి వారు పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి తొలుత అమెరికా అధ్యక్షుడు చేసిన ప్రకటనను ఆ పార్టీ తప్పుబట్టింది.



మన దేశ సమస్య అయిన కాశ్మీర్ను అంతర్జాతీయ సమస్యగా చేయడాన్ని వ్యతిరేకించింది. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందంపై తొలుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం మొదలైన విషయాలు చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానిని కోరారు. భవిష్యత్తులో రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి.. భారత ప్రజల సమిష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి ఇది ఒక అవకాశంగా మారుతుందని రాహుల్ అన్నారు. కాల్పుల విరమణ నిర్ణయం తీసుకోవడానికి భారత్కు పాక్ నుంచి ఏమి ప్రయోజనం వచ్చిందని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతగా ఖర్గే కూడా ప్రధాని మోదీకి లేఖ రాశారు. కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రత్యేక సమావేశంలో తమకు తెలియజేయాలని కోరారు. ఈ విషయంపై కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ మాట్లాడుతూ..పీవోకే ఎప్పటికీ భారత్ భూభాగమే అని.. దానిని మనం వెనక్కి తీసుకోవాలని అన్నారు. 1994 ఫిబ్రవరి 22న దేశంలో జరిగిన ఉగ్రదాడుల అనంతరం దేశంలో జమ్మూ కశ్మీర్ అంతర్భాగంగా ఉంటుందని లోక్సభ, రాజ్యసభ తీర్మానాన్ని ఆమోదించాయని సచిన్ గుర్తు చేశారు. అందులో జమ్మూ కశ్మీర్ ప్రాంతంలో పాక్ అక్రమంగా ఆక్రమించిన ప్రాంతాలను తప్పనిసరిగా వదిలి పెట్టాలని డిమాండ్ చేశామన్నారు. ఈ తీర్మానాన్ని పునరుద్ఘాటించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. కాల్పుల విరమణ గురించి పాక్ సైన్యాధిపతి ఆసిం మునీర్ తో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో ఫోన్లో మాట్లాడారు. సైనిక ఉద్రిక్తతలను తగ్గించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్తోనూ రూబియో ఫోన్లో మాట్లాడారు. భారత్ ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఆచితూచి వ్యవహరించిందని, అదే తీరును కొనసాగిస్తుందని జైశంకర్ ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం ఇరుదేశాలతో తాము జరిపిన దౌత్య చర్చల వల్ల భారత్- పాక్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఆ తర్వాత భారత్ ఈ విషయాన్ని వెల్లడించింది.

# మురళీనాయక్ కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం:పవన్

దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన జవాను మురళీనాయక్కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు.

**గోరంట్ల, మే 11, (రిపబ్లిక్ న్యూస్):** దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన జవాను మురళీనాయక్కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు వెళ్లి జవాను భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. మురళీనాయక్ తల్లిదండ్రులను ఆయన ఓదార్చారు. కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా అండగా ఉంటాయని భరోసా కల్పించారు.



వారికి రాష్ట్రప్రభుత్వం తరపున రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆయన స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మురళీనాయక్ కుటుంబానికి ఐదెకరాలతో పాటు 300 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు నిర్ణయించారు. వీరజవాను కుటుంబానికి రూ.25 లక్షల వ్యక్తిగత సాయం చేస్తానని పవన్ హామీ ఇచ్చారు. ఇంకా ఎలాంటి సాయం కావాలన్నా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మురళీనాయక్ కుటుంబానికి భగవంతుడు ధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.

## ముగిసిన వీర జవాను అంత్యక్రియలు

సత్యసాయి జిల్లా కళ్లితండాలో వీరజవాను మురళీ నాయక్ అంత్యక్రియలు ముగిశాయి. అంత్యక్రియల్లో మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, అనిత, సవిత, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, స్థానికులు పాల్గొని నివాళి అర్పించారు.



# అమర వీరుడు మురళీనాయక్‌కు

## నివాళులర్పించిన మంత్రులు లోకేశ్, అనగాని

**దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన జవాను మురళీనాయక్‌కు మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, అనిత నివాళులర్పించారు.**

**గోరంట్ల, మే 11, (రిపబ్లిక్ న్యూస్):** దేశ సరిహద్దుల్లో వీరమరణం పొందిన జవాను మురళీనాయక్‌కు మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ నివాళులర్పించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు వెళ్లి జవాను భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు.



మురళీనాయక్ తల్లిదండ్రులను లోకేశ్ ఓదార్చారు. జవాను పార్థివదేహం వద్ద నివాళులర్పించిన అనంతరం ఆయన సెల్యూట్ చేశారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని లోకేశ్ భరోసా ఇచ్చారు. వీరితో పాటు ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, కందికుంట ప్రసాద్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తదితరులు జవాను భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.



# ఇళ్లకు అప్పుడే రావొద్దు..

## :సరిహద్దు గ్రామాల ప్రజలకు అడ్వైజరీ

**భారత్-పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలకు జమ్మూకశ్మీర్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు.**

**శ్రీనగర్, మే 11, (రిపబ్లిక్ న్యూస్):** భారత్–పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలకు జమ్మూకశ్మీర్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్ దుశ్చర్యల కారణంగా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లిన సరిహద్దు గ్రామాల ప్రజలకు కీలక అడ్వైజరీ జారీ చేశారు. ప్రజలు అప్పుడే తిరిగి తమ ఇళ్లకు తిరిగి రావొద్దని.. సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని కోరారు.



పాకిస్థాన్ ప్రయోగించిన ఫిరంగి గుండ్లు (షెల్స్) నుంచి ఈ ప్రాంతాలను గుర్తించి శానిటైజ్ చేయాల్సి ఉందని తెలిపారు. పాక్ దాడుల తీవ్రతకు అధికంగా నష్టపోయే అవకాశం ఉండటంతో బారాముల్లా, బందిపోరా, కుప్వారా జిల్లాల్లోని నియంత్రణ రేఖ సమీపంలోని గ్రామాలకు చెందిన దాదాపు 1.25 లక్షల మందికి పైగా ప్రజలను భద్రతా సిబ్బంది ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించిన విషయం తెలిసిందే. అయితే, సరిహద్దు ప్రాంతాల్లో తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఇప్పుడే తమ నివాసాలకు వెళ్లొద్దని కోరుతున్నారు. దాడుల సమయంలో పాక్ ప్రయోగించిన షెల్స్ (ఫిరంగి గుండ్లు) చెల్లాచెదురుగా పడి ఉండటం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ప్రభావిత ప్రాంతాలకు బాంబు నిర్వీర్య బృందాలను పంపి గ్రామాల్లో ప్రజల ప్రాణ నష్టానికి కారణమయ్యే ఫిరంగి గుండ్లను గుర్తించి, శానిటైజ్ చేస్తామని తెలిపారు. మరోవైపు, 2023లో ఎల్వోసీ సమీపంలో ఇలా మిగిలిపోయిన షెల్స్ పేలుడుతో 41మంది ప్రాణాలు కోల్పోవడం అప్పట్లో విషాదం నింపింది. అందువల్ల పౌరులు గ్రామాలకు ఇప్పుడే తిరిగి వెళ్లొద్దు అని అధికారులు సూచించారు.

# పీవోకేను అప్పగించడంపై తప్ప వేరే చర్చల్లేవ్:భారత్

**కశ్మీర్ అంశంపై స్పష్టమైన వైఖరితో ఉన్నట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ను (పీవోకే) తిరిగి అప్పగించడమే మిగిలి ఉందని తెలిపాయి.**

**ఢిల్లీ, మే 11, (రిపబ్లిక్ న్యూస్):** కశ్మీర్ అంశంపై స్పష్టమైన వైఖరితో ఉన్నట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ను (పీవోకే) తిరిగి అప్పగించడమే మిగిలి ఉందని తెలిపాయి. పీవోకేను అప్పగించడం తప్ప మరోదానిపై చర్చించేది లేదని తేల్చి చెప్పాయి. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, పాకిస్థాన్ను బలంగా, భారీగా, అత్యంత సుదూర ప్రాంతాల్లో దెబ్బతీశామని చెప్పాయి. బహవల్పూర్ లోని జైషే మహమ్మద్ ప్రధాన కేంద్రాన్ని నేలమట్టం చేసినట్లు తెలిపాయి.



# తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు..

# టాప్-10 ర్యాంకర్లు వీళ్లే..

**తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకులూ బాలురకే వచ్చాయి.**

**హైదరాబాద్, మే 11, (రిపబ్లిక్ న్యూస్):** తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకులూ బాలురకే వచ్చాయి. మొదటి మూడు ర్యాంకులూ ఏపీకి చెందిన విద్యార్థులకు దక్కాయి. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్చంద్రకు మొదటి ర్యాంకు, నంద్యాల జిల్లా కోనాపురం వాసి ఉడగండ్ల రామ్చరణ్ రెడ్డికి రెండో ర్యాంకు, విజయనగరం జిల్లాకు చెందిన హేమసాయి సూర్యకార్తీకక్కు మూడో ర్యాంకు వచ్చాయి.

హైదరాబాద్లోని నాచారానికి చెందిన మెండె లక్ష్మీభార్గవ్కు నాలుగో ర్యాంకు లభించింది. మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్ (మాదాపూర్)కు ఐదో ర్యాంకు, సుంకర సాయి రిశాంత్రెడ్డి (మాదాపూర్) ఆరో ర్యాంకు, రష్మిత్ బండారి (మాదాపూర్) ఏడో ర్యాంకు, బనిబ్రత మాజీ (బడంగ్ పేట్)కు ఎనిమిదో ర్యాంకు, కొత్త ధనుష్రెడ్డి (హైదరాబాద్)కు తొమ్మిదో ర్యాంకు, కొమ్మ కార్తీక్ (మేడ్చల్)కు పదో ర్యాంకు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు





## అగ్రికల్చర్–ఫార్మాలో..

అగ్రికల్చర్–ఫార్మా ఫలితాల్లో మేడ్చల్కు చెందిన సాకేత్రెడ్డికి మొదటి ర్యాంకు వచ్చింది. కరీంనగర్కు చెందిన సబ్బాని లలిత్ వరేణ్య (కరీంనగర్)కు రెండో ర్యాంకు, వరంగల్కు చెందిన అక్షిత్కు మూడో ర్యాంకు లభించాయి. సాయినాథ్ (కొత్తకోట, వనపర్తి)కు నాలుగో ర్యాంకు, బ్రాహ్మణి (మాదాపూర్)కి ఐదో ర్యాంకు, గుమ్మడిదల తేజస్ (కూకట్పల్లి)కు ఆరో ర్యాంకు, అఖిరానందన్రెడ్డి (నిజాంపేట)కు ఏడో ర్యాంకు, భానుప్రకాశ్రెడ్డి (సరూర్నగర్)కి ఎనిమిదో ర్యాంకు, శామ్యూల్ సాత్విక్ (హైదర్గూడ)కు తొమ్మిదో ర్యాంకు, అద్దుల శశికరణ్ రెడ్డి (బాలాపూర్)కి పదో ర్యాంకు వచ్చాయి.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# మృణాల్ ఠాకూర్తో పెళ్లి వార్తలు.. స్పందించిన సుమంత్

నటుడు సుమంత్, నటి మృణాల్ ఠాకూర్ వివాహం చేసుకోబోతున్నారంటూ ఇటీవల ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. వీటిపై సుమంత్ స్పందించారు.



నటుడు సుమంత్, నటి మృణాల్ ఠాకూర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. వీరిద్దరూ కలిసి దిగిన ఓ ఫొటో కూడా నెట్టింట వైరల్గా మారింది. వీటిపై తాజాగా సుమంత్ స్పష్టతనిచ్చారు. తన తదుపరి చిత్రం 'అనగనగా' ప్రమోషన్స్లో భాగంగా పెళ్లి వార్తలపై స్పందించారు. ఆయా వార్తల్లో నిజం లేదని పేర్కొన్నారు. సోషల్మీడియాను తాను పెద్దగా ఉపయోగించనని.. అందుకే ఈ వార్తలు తన దృష్టికి రాలేదని సుమంత్ తెలిపారు. నెట్టింట వైరల్గా మారిన ఫొటో తాము 'సీతారామం' ప్రమోషన్స్ సమయంలో తీసుకున్నామని వివరించారు. మరో ఇంటర్వ్యూలో ఆయన పెళ్లిపై మాట్లాడుతూ.. వైవాహిక బంధంలోకి మరోసారి అడుగుపెట్టే ఉద్దేశం లేదన్నారు. సుమంత్కు గతంలోనే వివాహం జరిగిన విషయం తెలిసిందే. నటి కీర్తి రెడ్డిని పెళ్లి చేసుకున్నారు. కొంతకాలానికే వీరిద్దరూ విడిపోయారు. సుమంత్ హీరోగా నటించిన తాజా చిత్రమే 'అనగనగా'. 'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీగా ఇది విడుదల కానుంది. కాజల్ చౌదరి హీరోయిన్. సన్నీ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సుమంత్ ఉపాధ్యాయుడిగా నటించారు. నేటి విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపడంతోపాటు చిన్నారులకు ఏ విధంగా పాఠాలు బోధిస్తే త్వరగా అర్థమవుతుందో చెప్పే ప్రయత్నం చేసినట్టు కొన్ని రోజుల క్రితం విడుదలైన టీజర్ చూస్తే అర్థమవుతోంది. మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి పెంచకూడదని.. కాన్సెప్ట్ నేర్చుకుంటే చాలు మార్కులు వాటంతటవే వస్తాయనేది ఆ ఉపాధ్యాయుడి నమ్మకం. మరి, ఆయన ప్రయత్నం ఫలించిందా? వీరి కుమారుడు ఎన్ని మార్కులు సంపాదించాడు? తదితర అంశాలతో ఈ సినిమా రూపొందింది.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1895 : తత్వవేత్త, ఆధ్యాత్మిక వేత్త, రచయిత, ఉపన్యాసకుడు జిడ్డు కృష్ణమూర్తి జననం (మ.1986).
- 1918 : భారతీయ నృత్యకళాకారిణి, నృత్యదర్శకురాలు మృణాళినీ సారభాయ్ జననం (మ.2016). (చిత్రంలో)
- 1922 : తెలుగు సినిమా నేపథ్య గాయకుడు, రంగస్థల నటుడు మాధవపెద్ది సత్యం జననం (మ.2000).
- 1928 : భారతీయ రచయిత, హిందుస్తానీ సంగీత పండితుడు సామల సదాశివ జననం (మ.2012).
- 1961 : హైదరాబాదులో రవీంద్ర భారతి కళావేదిక ప్రారంభించబడింది.
- 1977 : తెలుగు సినిమా నటుడు పోసాని సుధీర్ బాబు జననం.
- 1994 : తైల పరిశోధన శాస్త్రవేత్త, సాహితీ విమర్శకుడు సర్దేశాయి తిరుమలరావు మరణం (జ.1928).
- 1998 : భారతదేశం రెండోసారి అణుపరీక్షలు జరిపింది. ఈ తేదీని జాతీయ వైజ్ఞానిక దినోత్సవంగా జరుపుతున్నారు.


జిడ్డు కృష్ణమూర్తి


మృణాళినీ సారభాయ్


మాధవపెద్ది సత్యం


సామల సదాశివ


రవీంద్ర భారతి కళావేదిక


సుధీర్ బాబు


సర్దేశాయి తిరుమలరావు



జాతీయ వైజ్ఞానిక దినోత్సవం

## రిపబ్లిక్ సినిమా CINEMA

### దర్శకుడి కల నెరవేర్చిన సూర్య, కార్తి..

సూర్య, కార్తి ఓ దర్శకుడి కలను నెరవేర్చారు. దీనిపై ఆనందం వ్యక్తం చేస్తూ దర్శకుడు ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.



కార్తి, అరవింద స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మెయ్యజగన్'. '96' ఫేమ్ ప్రేమ్ కుమార్ దీనిని రూపొందించారు. ఇదే చిత్రాన్ని తెలుగులో 'సత్యం సుందరం' పేరుతో విడుదల చేశారు. ఫీల్గుడ్ కథతో వచ్చిన ఈ చిత్రం విజయాన్ని అందుకుంది. అయితే.. చిత్ర దర్శకుడు ప్రేమ్కుమార్ ఎన్నో ఏళ్ల కలను తాజాగా సూర్య, కార్తి నెరవేర్చారు. ఆయనకు ఎంతో ఇష్టమైన మహీంద్రా థార్ను గిఫ్ట్ అందించారు. దీనిపై ప్రేమ్కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. హీరోలకు కృతజ్ఞతలు చెబుతూ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "మహీంద్రా థార్ అంటే నాకెంతో ఇష్టం. అది నా డ్రీమ్ వెహికల్. 5 డోర్ వెర్షన్ కోసం ఎంతోకాలంగా ఎదురుచూశా. మరీ ముఖ్యంగా రోక్స్ ఏఎక్స్ 5ఎల్ తెలుపు రంగు థార్ కోసం వేచి చూశా. ఎట్టకేలకు అది మార్కెట్లోకి వచ్చింది. దాచుకున్న డబ్బుతో దానిని కొనుగోలు చేయాలనుకున్నా. కాకపోతే బుక్ చేశాక ఏడాది పాటు ఎదురుచూడాలని తెలిసింది. ఆ తర్వాత నా దగ్గర ఉన్న డబ్బు కూడా ఖర్చు అయిపోయింది. దీంతో నా కలను విరమించుకున్నా. మొన్న సూర్య నుంచి నాకొక సందేశం వచ్చింది. నాకెంతో ఇష్టమైన కారు ఫొటో పంపించి.. "కారు వచ్చేసింది" అని అన్నారు. నాకేం అర్థం కాలేదు. ఫొటో చూసి షాకయ్యా. సూర్య నాకోసం ఈ కారు కొని గిఫ్ట్ గా ఇచ్చారు. కార్తి చేతుల మీదుగా కారు తాళాలు అందుకున్నా. దీనిని నేను గిఫ్ట్ చూడను. ఒక అన్న తన తమ్ముడి కలను నెరవేర్చినట్లు చూస్తా" అని పోస్ట్ చేశారు. గతేడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'మెయ్యజగన్' చిత్రానికి సూర్య, జ్యోతిక నిర్మాతలుగా వ్యవహరించిన విషయం తెలిసిందే.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## రిపబ్లిక్ స్పోర్ట్స్

# కోహ్లి నువ్వు ఆపద్బాంధవుడివి.. దయచేసి రిటైర్ అవ్వొద్దు:మాజీ క్రికెటర్ల విన్నపం

టెస్టు క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించాలనే ఆలోచనను మానుకోవాలని పలువురు మాజీ క్రికెటర్లు విరాట్ కోహ్లిని కోరారు.



టీం ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్టు క్రికెట్కు రిటైర్మెంట్ ప్రకటించి అభిమానులకు షాకిచ్చాడు. దీని నుంచి తేరుకునేలోపే మరో దిగ్గజ ఆటగాడు విరాట్ కోహ్లి కూడా సుదీర్ఘ ఫార్మాట్కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తుండడం అభిమానులకు మింగుడు పడడం లేదు. అయితే, కీలకమైన ఇంగ్లాండ్ పర్యటన ముంగిట ఇలాంటి నిర్ణయం తీసుకోవద్దని కోహ్లిని బీసీసీఐ కోరిందని సమాచారం. రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది. భారత మాజీ క్రికెటర్లు కూడా కోహ్లి ఇప్పుడే సుదీర్ఘ ఫార్మాట్కు వీడ్కోలు పలకొద్దని కోరుతున్నారు. అనుభవజ్ఞుడైన కోహ్లి ఇంగ్లాండ్ తో ఐదు టెస్టుల సిరీస్లో భారత్కు కీలకమవుతాడని పేర్కొన్నారు.

'విరాట్ కోహ్లి రిటైర్ అవ్వాలనుకుంటున్నాడు. అతను తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టించింది. అతని ఉద్దేశం సరైనది, గొప్పది. పాతతరం తప్పుకొని కొత్తతరానికి అవకాశం కల్పించాలి. కానీ ఇది సరైన సమయం, సందర్భం కాదు. సవాలుతో కూడిన ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్తున్నాం. టెస్టు క్రికెట్ ఆడే ఇతర దేశాలు కూడా అక్కడ గెలవడం కష్టం. ఇంగ్లాండ్ టూర్లో టీన్ఇండియాకు కోహ్లి ఆపద్బాంధవుడు అవుతాడు. ఎందుకంటే అతను అనుభవజ్ఞుడు. మరోవైపు, రోహిత్ శర్మ రిటైర్ అయ్యాడు. ఇలాంటి తరుణంలో అనుభవం లేని జట్టును ఇంగ్లాండ్కు పంపొద్దు"
– నవ్ జ్యోత్ సింగ్ సిద్ధూ

'విరాట్ కోహ్లి.. దయచేసి రిటైర్ అవ్వొద్దు. ఇప్పుడు టీమ్ ఇండియాకు మీ అవసరం చాలా ఉంది. మీలో ఇంకా ఆడే సత్తా చాలా ఉంది. మీరు టీమ్ ఇండియా తరఫున బరిలోకి దిగకపోతే టెస్టు క్రికెట్కు కళ ఉండదు. దయచేసి మీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి
– అంబటి రాయుడు

'టెస్టు క్రికెట్కు విరాట్ కోహ్లి కావాలి. రిటైర్మెంట్ ఆలోచన వెనక్కి తీసుకోవాలని అతన్ని ఒప్పించబోతున్నారు. అతను టెస్టు క్రికెట్ నుంచి రిటైర్ కావడం లేదు. తన మిగిలిన టెస్టు కెరీర్లో సత్తా చాటుతాడు. 60 కంటే ఎక్కువ సగటునే కలిగి ఉంటాడు' – బ్రియాన్ లారా


## ఇంటి చిట్కాలు

# పూరీలు, పకోడీల్లాంటి ఫుడ్స్ని ఇప్పుడు చెప్పే 4 నూనెలతో ఫ్రై చేస్తే ఏ సమస్యలు రావట, స్వయంగా డాక్టరే చెప్పారు


డీప్ ఫ్రై వంటలు అంటే చాలా మందికి ఇష్టం. వారానికోసారైనా ఇలా ఇంట్లో డీప్ ఫ్రై చేసిన వంటలు ఉంటాయి. మరి అందుకోసం ఎలాంటి నూనెలు వాడితే మంచిదో తెలుసుకోండి.

రెగ్యులర్గా హెల్దీ ఫుడ్ తీసుకున్నప్పటికీ అప్పుడప్పుడూ క్రంచీగా ఏవైనా తినాలనిపిస్తుంది. మన నాలుక డీప్ ఫ్రైడ్ ఫుడ్స్ని కోరుకుంటుంది. అందుకే, అప్పుడప్పుడైనా చాలా మంది బజ్జీలు, పూరీలు, పకోడీలు, సమోసాలు చేసుకుని వారి క్రేవింగ్స్ని సాటిస్ఫై చేసుకుంటారు. అయితే, ఎప్పుడోసారి ఇలా చేసుకుని తినడంలో ఏమాత్రం తప్పులేదని చెబుతున్నారు నిపుణులు. అయితే, వాటిని కూడా హెల్దీ వేలో చేసుకుంటే మరింత మంచిదని చెబుతున్నారు. అంటే మనం ఫ్రై చేసే నూనె హెల్దీగా ఉంటే మరింత మంచిది కదా అని కొన్ని ఆప్షన్స్ ఇస్తున్నారు. ఆ నూనెలతో ఫ్రై చేసి తింటే హెల్త్పై అంత ఎఫెక్ట్ ఉండదని చెబుతున్నారు.

### గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ ప్రకారం



ఫేమస్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి.. డీప్ ఫ్రైయింగ్ కోసం కొన్ని ఆయిల్స్ని సజెస్ట్ చేస్తున్నారు. వీటిని వాడితే గట్ ప్రాబ్లమ్స్ రావని, అప్పుడప్పుడు వాడేందుకు ఇవి సరైనవని సూచిస్తున్నారు. దీని వల్ల జీర్ణ వ్యవస్థపై ఎలాంటి ఎఫెక్ట్ పడదని, ఎలాంటి సమస్యలు రావని చెబుతున్నారు.



### సేథి ప్రకారం



డాక్టర్ సేథి నాలుగు నూనెల గురించి చెబుతున్నారు. వాటి స్మోక్ పాయింట్ ఆధారంగా వాటి సామర్థ్యాన్ని అంచనా వేసి కొన్ని నూనెల గురించి చెప్తున్నారు. ఇవన్నీ కూడా అధిక స్మోక్ పాయింట్ కలిగి ఉంటాయని, ఎందుకంటే నూనె పొగని ఉత్పత్తి చేసినప్పుడు అది విచ్ఛిన్నమై ఆహార నాణ్యత, పేగు ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేసే సమ్మేళనాలను విడుదల చేస్తుంది. అలా కాకుండా ఆయన నాలుగు నూనెల గురించి చెబుతున్నారు. అవేంటంటే,

### రిఫైండ్ కొబ్బరినూనె



ఈ నూనెలో సంతృప్త కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇది దాదాపు 400 డిగ్రీల అధిక స్మోక్ పాయింట్ని కలిగి ఉంటుంది. కాబట్టి, దీనిని మనం డీప్ ఫ్రైకి వాడితే ఎలాంటి సమస్యలు ఉండవు. పైగా ఆరోగ్యానికి మంచిది కూడా అని చెబుతున్నారు.

### అవకాడో ఆయిల్



అవకాడో నూనె..ఈ నూనె దాదాపు 520 డిగ్రీల ఫారెన్ హీట్ అధిక ధూమపాన బిందువుని కలిగి ఉంటుంది. ఈ నూనె కూడా ఫ్రై చేయడానికి చాలా మంచిది. వీటిని డీప్ ఫ్రై కోసం హ్యాపీగా వాడుకోవచ్చని డాక్టర్ చెబుతున్నారు.

### నెయ్యి, క్లారిఫైడ్ బటర్




డాక్టర్ ప్రకారం, నెయ్యి, క్లారిఫైడ్ బటర్ రెండు కూడా 450 డిగ్రీల ఫారెన్ హీట్ అధిక పొగ బిందువుని కలిగి ఉంటుంది. దీనిని వేడి చేసి ఇందులో వండితే ఎక్కువగా ఎఫెక్ట్ ఉండదు. కాబట్టి, ఇది కూడా ఫ్రైకి చాలా మంచిది.

### రిఫైండ్ ఆలివ్ ఆయిల్



ఆలివ్ ఆయిల్ కూడా ఫ్రై చేయడానికి బెస్ట్ ఆయిల్. కానీ, అన్ని రకాల డీప్ ఫ్రైకి ఇది మంచిది కాదు. డాక్టర్ సేథి ప్రకారం రిఫైండ్ ఆలివ్ ఆయిల్లో మోనోఅన్శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ పుష్కలంగా ఉంటాయి. దాదాపు 465 డిగ్రీల ఫారెన్ హీట్ అధిక స్మోక్ పాయింట్ ఉంటుంది. అయితే, ఇందులో గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏంటంటే ఎక్స్ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ డీప్ ఫ్రైకి అస్సలు మంచిది కాదు.

### చివరగా



సన్ఫ్లవర్, సోయాబీన్, కనోలా వంటి సీడ్ ఆయిల్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. వీటిలో పాలీ అన్శాచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఎక్కువగా ఉంటాయి. అధిక ఉష్ణోగ్రతల వద్ద ఈ నూనెలు ఆక్సీకరణం చెందుతాయి.

గమనిక :ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.